సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 5 । జూలై । 2025



కలల తీరాలకు తొలి అడుగు

ఈఏపీ సెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలతో విద్యార్థులు, తల్లిదండ్రులు వెబ్ ఆప్షన్లపై దృష్టి పెడుతున్నారు. 8లో ▸



ఆలయంలో భారీ చోరీ

ద్వారకాతిరుమల మండలం గుండుగొలను కుంటలో కండిగలమ్మ ఆలయంలో గురువారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. వెండి, బంగారు అభరణాలు చోరీ చేశారు. 8లో ▸



వృద్ధులే టార్గెట్‌గా..

ఏలూరు జిల్లాలో వృద్ధులను టార్గెట్ చేస్తూ దాడులు, చోరీలకు పాల్పడుతున్న కేసులను ఛేదించారు. ఎస్పీ శివకిషోర్ శుక్రవారం కేసుల వివరాలు వెల్లడించారు. 8లో ▸

న్యూస్‌రీల్

కొత్త బస్సులు ప్రవేశ పెట్టాలి



ఆర్టీసీ డిపో గేటు వద్ద ధర్నా

తాడేపల్లిగూడెం (టీఓసీ): కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సులు ప్రవేశపెట్టాలని, అర్హులైన ఆర్టీసీ ఉద్యోగులందరికీ పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు ఇవ్వాలని, ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పది వేల సిబ్బంది నియామకాలకు ప్రభుత్వం వెంటనే అనుమతి ఇవ్వాలని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ గ్యారేజీ గేటు వద్ద డిపో ఈయూ అధ్యక్షుడు చోడగిరి వెంకటరమణ, సెక్రటరీ కె.శ్రీను ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా జరిగింది. రీజనల్ సభ్యులు శేఖర్, ఏఐటీసీ ఏరియా ప్రెసిడెంట్ ఓవీ రాజు మాట్లాడుతూ పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా 3 వేల కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, మహిళలకు ఉచిత ప్రయాణం స్కీం సక్సెస్ కావాలంటే కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సులు రావాల్సిందేనన్నారు.

ఐచ్ఛిక సెలవులు ఇవ్వాలి

భీమవరం: పాఠశాలలకు ఐచ్ఛిక సెలవులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం , ప్రధాన కార్యదర్శి పీవీ నారాయణ ఒక ప్రకటనలో కోరారు. ఈ ఏడాది జూన్ 27న రథయాత్రకు పాఠశాలకు సెలవు ప్రకటించకుండా కేవలం 50 శాతం ఉపాధ్యాయులను సెలవు పెట్టుకోమన్నారని చెప్పారు. సింగిల్ టీచర్ పాఠశాలకు ఆప్షనల్ హాలిడే ఇచ్చుకునే అవకాశం లేదన్నారు. ఈ క్రమంలో జూలై 5న మొహరం సందర్భంగా ఆప్షనల్ హాలిడే ప్రకటించుకునే అవకాశం పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, ఎంఈఓలకు ఇవ్వాలని వారు కోరారు.

ఉధృతంగా గోదావరి



సిద్ధాంతం వద్ద గోదావరి ఉధృతి

పెనుగొండ: గోదావరి ఉధృతి పెరుగుతుంది. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో వరద నీటి తీవ్రత పెరుగుతుంది. ధవళేశ్వరం నుంచి సముద్రంలోకి నీటిని వదులుతుండడంతో సిద్ధాంతం వద్ద గోదావరి నిండు కుండలా ప్రవహిస్తుంది. పుష్కర రేవు వరకు నీరు చేరింది. గోదావరి మధ్యస్థలంకలోకి రైతులు పడవలపై వెళ్లి వస్తున్నారు. మరింత ఉధృతి పెరిగితే రాకపోకలపై నియంత్రణ విధిస్తారు. పరివాహక ప్రజలు ఎప్పటికపుడు అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: మున్సిపాల్టీల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి, పురపాలక శాఖ మంత్రులకు లేఖ రాసినట్లు ఏపీ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్‌రావు చెప్పారు. నిత్యం తాగునీరు, వీధి లైట్లు, కంప్యూటర్ ఆపరేటింగ్ వంటి విధుల్లో కీలకపాత్ర పోషిస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు పెంచి న్యాయం చేయాలన్నారు. కోవిడ్ సమయంలో సైతం అత్యవసర సేవలందించిన వారికి వేతనాలు తక్కువేగాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని వారి కుటుంబ భద్రతను దృష్టిలో పెట్టుకుని సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఆదుకోవాలని కృష్ణమోహనరావు లేఖలో కోరారు.

స్కానింగ్ సెంటర్‌లు నిబంధనలు పాటించాలి



స్కానింగ్ సెంటర్ తనిఖీ చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి జి.గీతాబాయి

భీమవరం(ప్రకాశం చౌక్): నియమ నిబంధనలను పాటించని స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని మెడ్ క్వెస్ట్ స్కానింగ్ సెంటర్‌ను వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ జి.గీతాబాయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కానింగ్ సెంటర్ నిర్వహణ తీరును పరిశీలించారు.

కూటమి హామీలపై నిలదీద్దాం

- 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'పై విస్తృత ప్రచారం
- అక్రమ కేసులకు భయపడే ప్రసక్తి లేదు
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ బొత్స



భీమవరంలో వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు



సమావేశంలో చంద్రబాబు హామీలను క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకోవచ్చని వివరిస్తున్న బొత్స

భీమవరం: ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయని వైనాన్ని బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ పేరుతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ చెప్పారు. శుక్రవారం భీమవరంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంపై సన్నాహకంగా వైఎస్సార్‌సీపీ జిల్లా స్థాయి విస్తృత సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతోపాటు మరిన్ని పథకాలు అమలుచేస్తామని ఏ ఇంటికి ఎంత లబ్ధి చేకూరుతుందో అంకెలతో సహా బాండ్లు ఇచ్చారని, కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఒక్క పథకం కూడా అమలుచేయలేదని విమర్శించారు. ప్రజల కష్టాలు, ఇబ్బందులను ప్రభుత్వానికి తెలియచేసి మెడలు వంచి పనిచేయించాల్సిన బాధ్యత పార్టీలపై ఉందని, కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలుచేయాలని వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన పనిచేస్తుందన్నారు. ఎన్నికల హామీలను ఖురాన్, బైబిల్, భగవద్గీత మాదిరిగా భావించి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తితో అమలుచేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని స్పష్టం చేశారు. ప్రశ్నిస్తానంటూ రాజకీయాల్లోకి వచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ టీడీపీ చెంతనచేరి అసలు ప్రశ్నించడమే మర్చిపోయారని ఎద్దేవా చేశారు. నారా లోకేష్ మోసం చేయడం, హామీలను విస్మరించడంలో తండ్రిని మించిపోయాడన్నారు. ప్రజల పక్షాల మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులను తోక కత్తిరిస్తాం, కేసులు పెడతామని భయపెడితే బెదిరిపోయేది లేదన్నారు.

రైతులు, మహిళలను మోసగించిన బాబు

రాష్ట్రంలో 40 శాతం ఓట్లతో వైఎస్సార్‌సీపీ ఎంతో బలంగా ఉందని దీనిని మరింత పటిష్టం చేసి ప్రజల పక్షాన నిలబడడానికి పార్టీ శ్రేణులు నిబద్ధతతో కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రధానంగా మహిళలు, రైతులను మోసం చేస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందని తల్లికి వందనం పేరుతో కొంతమందికే సొమ్ములు వేసి మిలిగిన వారిని మోసం చేశారని, పంటలకు గిట్టుధర ఇవ్వకుండా, అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయకుండా రైతులను తీవ్రంగా మోసగించారన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసగించి ఏడాది పాలన పూర్తిచేసి సంబరాలు చేసుకుంటున్నారన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ.. గ్రామ స్థాయిలో భారీగా నిర్వహించి కూటమి ప్రభుత్వ నిర్వాకాన్ని ప్రజలకు వివరించాలన్నారు.

చిత్తశుద్ధితో పాటుపడాలి

ముదునూరి ప్రసాదరాజు

సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా పార్టీ అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని పటిష్టం చేయడంలో భాగంగా జిల్లాలో పార్టీ జిల్లా, మండల స్థాయిలో కమిటీలు, అనుబంధ కమిటీల నియామకం పూర్తి చేసినట్లు చెప్పారు. పదవులు పొందిన నాయకులు చిత్తశుద్ధితో పార్టీ కోసం అహర్నిశలు పాటుపడాలని కష్టపడి పనిచేసిన వారికి మరింత గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధులను ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులను మేడిది జాన్సన్ సభకు పరిచయం చేశారు. పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు, మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, నరసాపురం పార్లమెంట్ కన్వీనర్ గూడూరి ఉమాబాల, భీమవరం, పాలకొల్లు నియోజకవర్గాల సమన్వయకర్తలు చినమిల్లి వెంకటరాయుడు, గుడాల శ్రీహరిగోపాలరావు(గోపి), పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, పార్టీ నాయకులు వేండ్ర వెంకటస్వామి, పెండ్ర వీరన్న, గుణ్ణం నాగబాబు, చెల్లెం ఆనందప్రకాష్, చెరుకువాడ నరేష్, అండ్ర చల్లారావు, తిరుమాని నాగరాజు, కామన నాగేశ్వరరావు, పేరిచర్ల విజయనర్సింహరాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి జీవితం ఆదర్శనీయం



మాట్లాడుతున్న ఎంపీ పాకా సత్యనారాయణ, చిత్రంలో మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, కలెక్టర్ నాగరాణి తదితరులు

భీమవరం (ప్రకాశంచౌక్): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిదాయక జీవితం అందరికీ ఆదర్శమని, ఆయన త్యాగాలను తప్పక స్మరించుకోవాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. శుక్రవారం భీమవరం అల్లూరి స్మృతివనం 30 అడుగుల కాంస్య విగ్రహం వద్ద, అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం వద్ద మన్యం వీరుడు శ్రీ అల్లూరి సీతారామరాజు 128వ జయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీ అల్లూరి సీతారామరాజు సేవాసమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజ్ మాట్లాడుతూ అల్లూరి మనందరికీ ఆదర్శమని అన్నారు. రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో జరిగిన అనేక పోరాటాలకు సంబంధించి స్మరించుకునే వారిలో అల్లూరి మొదటి వరుసలో ఉంటారన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జీవితం ప్రతి భారతీయుడికి గర్వకారణమన్నారు. భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తదితరులు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

ధాన్యం బకాయిలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): ఖరీఫ్ సీజన్ సగం పూర్తిగా కావస్తున్నందున రైతులకు అన్నదాత సుఖీభవ తక్షణం అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపు నగదు జమ చేస్తామని చెప్పినా రూ.1000 కోట్లు బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు. విద్యుత్ వినియోగదారులపై అదనపు చార్జీల పేరుతో రూ.15,500 కోట్ల భారం వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని లోకేష్ పిలుపునిచ్చారని ఇప్పుడు డిజిటల్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఈ నెల 5న తహసీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వంగవీటి సేవలు చిరస్మరణీయం

కైకలూరు: పేద ప్రజల సంక్షేమం కోసం దివంగత వంగవీటి మోహన రంగా సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. రంగా 78 జయంతి సందర్భంగా కై కలూరు, ఆటపాక గ్రామాల్లో ఆయన విగ్రహాలకు శుక్రవారం నివాళి అర్పించి, మిఠాయిలు పంచి పెట్టారు. డీఎన్నార్ మాట్లాడుతూ శాసనసభ్యుడిగా రంగా విజయవాడలో అనేక మంది కార్మికులు, పేదలకు సాయం చేశారన్నారు.

వైఎస్సార్‌సీపీ వీవర్స్ విభాగం అధ్యక్షుడిగా మల్లికార్జునుడు



పాలకొల్లు సెంట్రల్: వైఎస్సార్‌సీపీ వీవర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా వీరా మల్లికార్జునుడు ఎంపికయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వచ్చాయి. కష్టపడి పనిచేసే వారికి పార్టీ ఎప్పుడూ సముచిత స్థానం కల్పిస్తుందని మల్లికార్జునుడు అన్నారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

హైవేపై గుంతలకు మోక్షం



జాతీయ రహదారిపై పడిన గుంతలు పూడ్చిన దృశ్యం

సాక్షి స్పందన

ఉంగుటూరు: జాతీయ రహదారిపై గుంతలకు ఎట్టకేలకు మరమ్మతులు చేశారు. 'రహదారి గుంతలు పూడ్చరా..' అంటూ సాక్షిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. గుండుగొలను, పూళ్ల, కై కరం, చేబ్రోలు, నారాయణపురం, ఉంగుటూరు పరిధిలో గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులపై స్పందించి మరమ్మతులు చేయించారు.

పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు



భీమవరం పట్టణంలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): కలెక్టర్ చదలవాడ నాగరాణి భీమవరం పట్టణంలో ప్రధాన రహదారులు, వాణిజ్య సముదాయాల్లో పారిశుద్ధ్యాన్ని శుక్రవారం తెల్లవారుజామున పరిశీలించారు. హోటల్స్, తోపుడు బళ్ళ ముందు చెత్త వేస్తే చర్యలు తప్పవని సంబంధిత యాజమాన్యాలకు తెలియజేశారు. ప్రతి ఒక్కరు డస్ట్ బిన్లను ఏర్పాటు చేసుకుని చెత్తను వేసుకోవాలని, మున్సిపల్ సిబ్బంది వచ్చినప్పుడు వారికి అందించాలని సూచించారు. అనంతరం బస్టాండ్ సమీపంలోని బుధవారం మార్కెట్‌లో అన్న క్యాంటీన్ కలెక్టర్ తనిఖీ చేసి ఆహార పదార్థాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాకాలంలో పరిసరాలను మరింత పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు, ఈగలు కారణంగా అనేక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని క్యాంటీన్ నిర్వాహకులను హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బుర్రా గోపీమూర్తి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రస్తుతం ప్రభుత్వ విద్యా రంగంలో ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ బుర్ర గోపీమూర్తి ఆరోపించారు. తాడేపల్లిగూడెం మండలంలో శుక్రవారం ఎమ్మెల్సీ కృతజ్ఞతా పర్యటన జరిగింది. పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులకు ప్రతి రోజూ రాత్రి వరకు సమావేశాలతో హింసిస్తున్నారని ఆరోపించారు. ఆన్‌లైన్ పేరుతో మానసిక ఆందోళనకు గురి చేస్తున్నారని తెలిపారు. పీఆర్‌సీని ఏర్పాటు చేయాలని, బకాయి పడ్డ డీఏలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ కార్యదర్శి శివ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీదేవి, హెచ్‌ఎం మైనం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ ఏలూరు డిపో గ్యారేజ్ వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు వెంటనే అనుమతులివ్వాలని, విద్యుత్ బస్సులను ఆర్టీసీ ద్వారానే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యూటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌లు చెల్లించాలని, పాత పద్ధతుల్లోనే రిఫరల్ ఆసుపత్రుల ద్వారా వైద్య సౌకర్యాలు అందించాలని డిమాండ్ చేశారు.

టిడ్కోలో సమస్యల మోత



టిడ్కోలో అధ్వానంగా చెత్తాచెదారం



భీమవరంలోని టిడ్కో ఇళ్ల సముదాయం



మంచినీళ్లు తెచ్చుకునేందుకు వెళ్తున్న దృశ్యం

- తాగునీటి కోసం రెండు కిలోమీటర్ల ప్రయాణం
- అధ్వాన పారిశుద్ధ్యంతో దోమల విజృంభణ

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా కేంద్రం భీమవరంలోని టిడ్కో ఇళ్ల సముదాయంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఈ సముదాయంలో 1920 ప్లాట్‌లు ఉండగా దాదాపు 1800 కుటుంబాలు నివసిస్తున్నాయి. మంచినీటి సమస్య, డ్రెయినేజీ, చెత్తాచెదారం, దోమల సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు ప్రజాప్రతినిధులు గానీ ఇటు అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. టిడ్కో ఇళ్లు పట్టణానికి దూరంగా ఉండడంతో అక్కడకు వెళ్లే అధికారి లేదు. మున్సిపాలిటీ నీళ్లు సక్రమంగా రావడం లేదు. తక్కువగా రావడం, అవి తాగడానికి పనికిరాకపోవడంతో.. మంచినీటి కోసం రెండు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది. నీటి సమస్య ఉందని తెలిసి వ్యాపారులు వ్యాన్‌పై టిన్లతో నీళ్లు తెచ్చి అమ్ముతున్నారు. తాగు నీటి సమస్యతో నెలల తరబడి ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. టిడ్కోలో మంచినీటి సమస్య ఉన్నప్పటికీ కనీసం ట్యాంకర్లతో మంచినీళ్లు సరఫరా చేయడం లేదు. మంచినీళ్లు లేక గొంతెండుతుందని మున్సిపాలిటీకి ఫిర్యాదు చేస్తే ఒకటి, రెండు వాటర్ ట్యాంకర్లు పంపించి చేతులు దులుపుకుంటున్నారు.

డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానం : టిడ్కోలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేదు. దాంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. వాడకం నీళ్లు బయటకు వెళ్లే మార్గం లేదు. ఎక్కడికక్కడ పిచ్చి మొక్కలు, పచ్చగడ్డి పెరిగిపోయింది. దాంతో దోమలు విజృంభించడంతో రోగాలు పాలవుతున్నారు. దోమల వల్ల జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. రోడ్డు పక్కన వేసిన చెత్తను మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది రెండు మూడు రోజులకు ఒకసారి వచ్చి తీసుకు వెళ్లుతున్నారని మహిళలు చెబుతున్నారు. రోజుల తరబడి చెత్త అలాగే ఉండిపోవడంతో దుర్వాసన వస్తుందని, ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. టిడ్కోలో సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికారులు స్పందించాలి. అక్కడ సమస్యలను పరిశీలించి పరిష్కరించే చర్యలు తీసుకోవాలి. మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా వచ్చిన ఆర్డీవో టిడ్కో సమస్యలపై దృష్టి పెట్టాలి.

తాగునీటికి ఇబ్బందులు



మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మంచినీటి సరఫరా సక్రమంగా లేదు. పైపుల నుంచి నీళ్లు చాలా తక్కువగా వస్తున్నాయి. తాగడానికి నీళ్లు బయట నుంచి తెచ్చుకుంటున్నాం.

– ఎస్.కృష్ణకుమారి, టిడ్కో నివాసి

రెండ్రోజులకోసారి చెత్త తొలగింపు



చెత్తను రెండు రోజులకోసారి తొలగిస్తున్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. రోజూ చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోంది. ప్రతి రోజూ చెత్త తొలగించి శుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బి.అమ్ములు, టిడ్కో నివాసి

రెండు కిలోమీటర్లు వెళ్తున్నాం



మంచినీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో రెండు కిలోమీటర్లు వెళ్లి మంచినీళ్లు తెచ్చుకుంటున్నాం. సాధారణ రోజుల్లో కూడా మంచినీటికి ఇబ్బందులు పడుతున్నాం. వాటర్ ట్యాంకులతో పుష్కలంగా నీళ్లు అందించడం లేదు. పైపులైన్‌లు ద్వారా నీళ్లు అరకొరగా వస్తున్నాయి.

– యు.స్వర్ణకుమారి టిడ్కో నివాసి

దోమలతో ఇక్కట్లు



టిడ్కో ఇళ్ల వద్ద దోమల విజృంభిస్తున్నాయి. సరైనన డ్రైనేజీ లేక పచ్చగడ్డి పెరగడంతో దోమలు దారుణంగా ఉంటున్నాయి. దోమల నివారణకు ఫాంగింగ్ గాని దోమల మందు గానీ జల్లడం లేదు. దోమల వల్ల వ్యాధులు వ్యాప్తిస్తాయని ఆందోళన చెందుతున్నాం.

– వై.మాధవి, టిడ్కో నివాసి

క్లుప్తంగా

స్నాతకోత్సవానికి గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్‌తో మాట్లాడుతున్న వీసీ గోపాల్

తాడేపల్లిగూడెం: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ కె.గోపాల్ రాజ్‌భవన్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 10న కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం, ఆత్కూర్‌లోని స్వర్ణభారతి ట్రస్ట్‌లో నిర్వహించనున్న ఉద్యానవర్సిటీ ఆరో స్నాతకోత్సవానికి హాజరు కావాలని ఆహ్వానించారు. ఉద్యాన వర్సిటీ సాధించిన ప్రగతిని వీసీ గవర్నర్‌కు వివరించారు. ఆయన వెంట రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు ఉన్నారు.

పార్సిల్ కార్యాలయాల తనిఖీ



పార్సిల్ కార్యాలయాలను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు


తాడేపల్లిగూడెం: పట్టణంలోని పార్సిల్ కార్యాలయాలను శుక్రవారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ పార్సిల్స్ ద్వారా స్పిరిట్, గంజాయి, డ్రగ్స్ వంటివి తరలించే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఈ తనిఖీలు చేస్తున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పార్సిల్ కార్యాలయాలు, కొరియర్ కార్యాలయాలు చట్ట విరుద్ధమైన వస్తువులు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఆర్ఎంటీ, నవత, వీఆర్ఎల్ లాజిస్టిక్ , బ్లూడార్ట్, ఆర్టీసీ, రైల్వే పార్సిల్ కార్యాలయాలు, డీటీడీసీ, ప్రొఫెషనల్ కొరియర్ సర్వీసుల కార్యాలయాలను, గోదాములను తనిఖీ చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ముదినేపల్లి రూరల్: చేపల పట్టుబడికి వెళ్లి అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పెదగొన్నూరులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఎ.హేమంతరావు ఈ నెల 1న చేపల పట్టుబడికి వెళ్లి ప్రమాదవశాత్తూ తల తిరిగి జారిపడిపోయాడు. చికిత్స నిమిత్తం పెదఅవుటుపల్లి ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం గురువారం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. మృతుడి భార్య రాఘవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కలల తీరాలకు తొలి అడుగు

- ఇంజనీరింగ్ ప్రవేశాల ప్రక్రియ షురూ
- 7 నుంచి షెడ్యూల్ ప్రారంభం
- 10 నుంచి వెబ్ ఆప్షన్లకు అవకాశం
- ఆగస్టు 4 నుంచి తరగతులు ప్రారంభం



ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఎన్నో ఆశయాలు, మరెన్నో లక్ష్యాలు నిర్దేశించుకుంటున్న విద్యార్థులు వాటిని సాధించడానికి, చేరుకోవడానికి వేయి ఆశలతో ఎదురు చూస్తున్న వారికి శుభవార్త. తమ లక్ష్యాలను సాధించడానికి తొలి అడుగు వేసే తరుణం వచ్చేసింది. ఇంటర్మీడియట్ పూర్తి చేసి, ఈఏపీసెట్‌లో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. విద్యార్థులు, తల్లిదండ్రులు వెబ్ ఆప్షన్లపై పూర్తి స్థాయిలో ఆలోచించుకుని తుది నిర్ణయం తీసుకోవాలని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు. ఏపీ ఈఏపీసెట్ పరీక్షల్లో ఏలూరు జిల్లా నుంచి 4700 మంది పరీక్ష రాయగా వారిలో ఇంజనీరింగ్ కోర్సుకు 3409 మంది మాత్రమే అర్హత సాధించారు.

ఈ కోర్సుల గురించీ తెలుసుకోండి..

ఇంజనీరింగ్‌లో సంప్రదాయ కోర్సులతో పాటు కొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ఈసీఈ, మెకానికల్, ఈఈఈ, సీఎస్ఈ, సివిల్ వంటి సంప్రదాయ కోర్సులు ఇప్పటికే ఉన్నాయి. కొత్తగా సీఎస్ఈలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, వెరీ లార్జ్ స్కేల్ ఇంటిగ్రేషన్ (వీఎల్ఎస్ఐ) డిజైన్, అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, ఏరోస్పేస్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్, నెట్ వర్కింగ్, అల్గారిథమ్స్, ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్, ప్రోగ్రామ్ డిజైన్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఆపరేటింగ్ సిస్టమ్స్, అగ్రికల్చరల్, మెరైన్, మైనింగ్, స్కిల్ అండ్ టెక్స్‌టైల్ వంటి కొత్త బ్రాంచిలు వచ్చాయి. ఈ కోర్సుల్లో నైపుణ్యం సాధించినా అపార అవకాశాలు ఉన్నాయి.

జిల్లాలో ఆరు ఇంజనీరింగ్ కళాశాలలు

ఏలూరు జిల్లాలో ఆరు ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా మొత్తం 4,920 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 1,200 సీట్లు, ఏలూరు రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో 900 సీట్లు, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో 660 సీట్లు, హేలాపురి ఇంజనీరింగ్ కళాశాలలో 420 సీట్లు, ఆగిరిపల్లిలో ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలలో 1,320 సీట్లు, నూజివీడు సారథి ఇంజనీరింగ్ కళాశాలలో 420 సీట్లు ఉన్నాయి.

షెడ్యూల్ ఇలా..

తొలి విడత కౌన్సెలింగ్

- జూలై 7 నుంచి 16 వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు
- జూలై 7 నుంచి 17 వరకూ ఆన్‌లైన్‌లో విద్యార్థులు అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్ల పరిశీలన
- జూలై 10 నుంచి 18 వరకూ వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునే అవకాశం
- జూలై 19న వెబ్ ఆప్షన్లు మార్చుకునేందుకు అవకాశం
- జూలై 22న సీట్ల కేటాయింపు.
- జూలై 23 నుంచి 26 వరకూ కళాశాలలో ప్రవేశాలు
- ఆగస్టు 4 నుంచి తరగతుల ప్రారంభం

మలివిడత కౌన్సెలింగ్

- జూలై 25 నుంచి 27 వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు
- జూలై 26 నుంచి 28 వరకూ ఆన్‌లైన్‌లో విద్యార్థులు అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్ల పరిశీలన
- జూలై 27 నుంచి 29 వరకూ వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునే అవకాశం
- జూలై 30న వెబ్ ఆప్షన్లు మార్చుకునేందుకు అవకాశం
- ఆగస్టు 1న సీట్ల కేటాయింపు
- ఆగస్టు 2 నుంచి 5 వరకూ కళాశాలలో ప్రవేశాలు

కండిగలమ్మ ఆలయంలో భారీ చోరీ



దుండగులు పడేసిన హుండీని పరిశీలిస్తున్న పోలీసులు, గర్భాలయాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సుధీర్

ద్వారకాతిరుమల: మండలంలోని గుండుగొలనుకుంట గ్రామంలో ఉన్న కండిగలమ్మ, పోతురాజు స్వామి వార్ల ఆలయంలో గురువారం అర్ధరాత్రి సమయంలో భారీ చోరీ జరిగింది. ఈ ఘటనలో అమ్మవారి మూలవిరాట్ మీద ఉన్న బంగారు, వెండి ఆభరణాలతో పాటు, హుండీలోని నగదు చోరీకి గురైంది. ఆలయ కమిటీ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు సుమారు రాత్రి 1 గంట సమయంలో ఆలయం గేట్లకు ఉన్న తాళాలను, ద్వారాలను పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌పై ఉన్న రెండున్నర కేజీల వెండి కిరీటం, ఒక వెండి కనురెప్ప, ఒక కాసు బంగారపు కళ్లు, అరకాసు బంగారు మంగళ సూత్రం, ముప్పావు కాసు బంగారు ముక్కుపుడక, బీరువాలోని విలువైన పట్టు చీరలను చోరీ చేశారు. అలాగే హుండీని పగలగొట్టి అందులోని సుమారు లక్ష రూపాయలను చోరీ చేశారు. ఆ తరువాత ఖాళీ హుండీని, అమ్మవారి మెడలోని గిల్టు మంగళ సూత్రాలను, చోరీకి ఉపయోగించిన సమిట, పలుగును ఆలయం పక్కనున్న కోకో తోటలో పడేశారు. రోజులానే శుక్రవారం ఉదయం ఆలయాన్ని తెరిచేందుకు వెళ్లిన ఆలయ కమిటీ చైర్మన్ చిలుకూరి ధర్మారావు చోరీ జరిగినట్టు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై టి.సుధీర్ ఆలయాన్ని, పరిసర ప్రాంతాలను, తోటలో దుండగులు పడవేసిన హుండీని, చోరీకి ఉపయోగించిన ఆయుధాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ జాగిలంతో తనిఖీలు జరిపారు. అలాగే క్లూస్ టీమ్ వేలిముద్రలను సేకరించింది. ధర్మారావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సుధీర్ తెలిపారు.

స్కూటర్ డిక్కీలో రూ.3 లక్షల చోరీ

భీమవరం : పట్టణంలోని వన్‌టౌన్ పరిధిలో ఓ ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్రవాహనం డిక్కీలోని రూ. 3 లక్షలు చోరీ చేశారని సీఐ ఎం.నాగరాజు తెలిపారు. అమలాపురం నుంచి వచ్చిన బాధితుడు ఎం.రమేష్ బాబు నగదును వేరొకరికి ఇద్దామనుకుని, కళాభవన్ వీధిలో ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఇంట్లోకి వెళ్లాడు. అయితే తిరిగి వచ్చేలోపు డిక్కీ తెరిచి నగదు ఎత్తుకెళ్లడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించగా వ్యక్తి ఎవరో వచ్చి వెళ్లినట్టుగా ఉండడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల ఘర్షణతో ఉద్రిక్తత



ఘటనా స్థలంలో డీఎస్పీ రవిచంద్ర, పోలీస్ సిబ్బంది

కామవరపుకోట : స్థానిక గుర్రాల చెరువు గట్టు వినాయక గుడి వెనుక శుక్రవారం రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో మండల కేంద్రంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు కారణమైంది. గత కొంత కాలంగా ఈ ప్రాంతంలో రెండు వర్గాల మధ్య ఉన్న చిన్న చిన్న గొడవలు చినికి చినికి తీవ్రంగా మారాయి. గురువారం రెండు వర్గాల మధ్య చిన్నపాటి వివాదం జరగ్గా శుక్రవారం మధ్యాహ్నం దానికి కొనసాగింపుగా ఓ వర్గం వారు చేసిన దాడుల్లో ఓ కుటుంబానికి చెందిన టిప్‌టాప్ సామగ్రి ధ్వంసమై భారీ నష్టం జరిగిందని బాధితులు చెబుతున్నారు. పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్రతో ఆధ్వర్యంలో నలుగురు ఎస్సైలు, పలువురు పోలీసు సిబ్బంది పరిసర ప్రాంతాల్లో భారీగా మోహరించారు. డీఎస్పీ రవిచంద్ర రాత్రి 8 గంటలు అయినా కూడా అక్కడే ఉండి పరిస్థితి పర్యవేక్షిస్తున్నారు. ఈ సంఘటనపై డీఎస్పీని వివరణ కోరగా వివాదం పూర్తి వివరాలను పరిశీలించి చెబుతానని తెలిపారు. అయితే ఈ వివాదం జరిగిన ప్రాంతంలో ఉన్న భూమిని దేవదాయ శాఖ అధికారులు శుక్రవారం రాత్రి రంగంలోకి దిగి స్వాధీనం చేసుకునే పనులు మొదలు పెట్టారు. ఆ స్థలంలో ఉన్న తూములను కూలీలతో పక్కకు తొలగిస్తున్నారు.

మెడికల్ షాప్, ల్యాబ్, క్లినిక్‌లలో తనిఖీలు



కొత్తూరులో దుర్గా మెడికల్ షాప్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న వైద్య అధికారులు

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి స్కే బీబీ జాన్, డీఎంహెచ్ఓ కార్యాలయ అడ్వకేట్ వడ్డీ సత్యా రవి స్థానిక కొత్తూరులో ఉన్న మందులు షాపు, క్లినిక్, ల్యాబ్‌లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. సాయిరాం క్లినిక్, దుర్గా మెడికల్ షాప్, శ్రీ సాయిరాం డయాగ్నస్టిక్ సెంటర్, సాయిరాం క్లినిక్, సాయిరాం మెడికల్ షాప్‌లో తనిఖీలు చేయగా సాయిరాం క్లినిక్‌లో 20 ఏళ్లుగా వైద్యం చేస్తున్న వ్యక్తికి సరైన సర్టిఫికెట్లు లేవని, అతను వైద్యం చేసేందుకు అనర్హుడని గుర్తించారు. శ్రీ సాయిరాం డయగ్నొస్టిక్ సెంటర్ టెక్నీషియన్‌కు రిజిస్ట్రేషన్ లేదని తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఈ తనిఖీలు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ల్యాబ్‌లు, క్లినిక్‌లు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ మేరకు అధికారులు నివేదిక ఇస్తామని వైద్యాధికారి పి.బీబీ జాన్ తెలిపారు.

జల్లేరు ఆధునికీకరణ పనులు ప్రారంభం



జల్లేరు జలాశయంలో జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని దొరమామిడి సమీపంలో ఉన్న గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయం నిర్వహణ పనుల నిమిత్తం రూ. 20 లక్షల నిధులు మంజూరు చేసినట్లు మైనర్ ఇరిగేషన్ ఏఈ టి.సురేష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నిధులతో గేట్లు, రంగులు వేయడం, ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్, ఆయిల్, గ్రీజు పనులు ఏడాది పాటు నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నట్లు, గతంలో రూ. 8 లక్షల వ్యయంతో స్పిల్‌వే గేట్లు మరమ్మతులు కూడా పూర్తి చేశామని తెలిపారు.

మావుళ్లమ్మ సన్నిధిలో మహా సుదర్శన హోమం

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద శుక్రవారం ఉదయం 7.30 గంటలకు మహా సుదర్శన హోమం నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ, వేదపండితులతో అమ్మవారికి పూజా కార్యక్రమాలను నిర్వహించామని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ తెలియజేశారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు యాగాన్ని ప్రారంభించి, అమ్మవారిని దర్శించుకునారు. సుమారు 1500 మంది భక్తులకు అమ్మవారి లడ్డు ప్రసాదాన్ని, భోజన సదుపాయాన్ని కల్పించారు.

ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలి

భీమవరం(ప్రకాశం చౌక్): భవ్య భీమవరం పేరిట చేపట్టిన వివిధ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సీహెచ్ నాగరాణి భవ్య భీమవరం ప్రాజెక్టుల పురోగతిపై భీమవరం మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి, ఆర్డీవో, మున్సిపల్ అధికారులతో సమావేశమై సమీక్షించారు. రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం చుట్టుపక్కల ఆధ్యాత్మికతతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటుకు మున్సిపల్ అధికారులు కృషి చేయాలన్నారు. నిబంధనలను అతిక్రమించి ఉన్న ఆక్రమణదారులకు వెంటనే నోటీసులు జారీ చేసి, తొలగింపుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భీమవరంలో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే చేపట్టిన పాత బస్టాండ్ మోడ్రన్ బస్ స్టాప్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీఓ, భీమవరం మున్సిపాలిటీ స్పెషలిటీ ఆఫీసర్ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి, సహాయ కమిషనర్ ఎ.రాంబాబు, జిల్లా టూరిజం అధికారి ఏవీ అప్పారావు, మున్సిపల్ ఇంజనీర్ పి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులే టార్గెట్‌గా దాడులు, చోరీలు

నలుగురు నిందితుల అరెస్ట్, భారీగా రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ శివకిషోర్, అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో వృద్ధులను టార్గెట్ చేస్తూ దాడులు చేస్తూ చోరీలకు పాల్పడుతున్న కేసులను పోలీస్ యంత్రాంగం ఛేదించింది. కైకలూరు రూరల్ పరిధిలో వృద్ధులను కొట్టి బంగారు ఆభరణాలు దోచుకెళ్ళిన దొంగలను పట్టుకున్న పోలీసులు, భారీగా చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ కేసుల వివరాలు వెల్లడించారు. కైకలూరు మండలం రామవరంలో ఒంటరిగా జీవిస్తోన్న వృద్ధ మహిళలను టార్గెట్ చేస్తూ వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగలను కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్ పట్టుకున్నారు. రామవరం గ్రామంలో భర్త చనిపోయి గూడూరు నాగలక్ష్మి ఒంటరిగా ఉంటుంది. మే నెల 28తేదీ రాత్రి 9.20గంటల సమయంలో ఇంట్లోకి చొరబడిన ఇద్దరు దొంగలు ఆమె తలకు ముసుగు వేసి చేతులతో ముఖంపై తీవ్రంగా కొట్టి గోడకు తలను కొట్టారు. ఆమె స్పృహతప్పి పడిపోవటంతో మెడలోని ఐదు కాసుల బంగారు చైన్, రెండు చేతులకు ఉన్న రెండు బంగారపు గాజులు లాక్కుని చనిపోయిందనే ఉద్దేశ్యంతో పరారయ్యారు. కొంతసేపటికి కోలుకున్న వృద్ధురాలు చుట్టుపక్కల వారి సహాయంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు కేసును దర్యాప్తు చేశారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో రూరల్ సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. కైకలూరు మండలం రామవరం గ్రామానికి చెందిన పంతగాని జాన్‌కుమార్, గరికిముక్కు రాజ్‌కుమార్ అనే ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 40 గ్రాముల బంగారు చైన్, 24గ్రాముల రెండు బంగారు గాజులు రికవరీ చేశారు.

బంగారు గాజుల చోరీ

కైకలూరు మండలం రామవరంలో సోము సీతామహాలక్ష్మి ఒంటరిగా ఉంటూ కిరాణా కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తోంది. అయితే 2024 ఫిబ్రవరి 13న పగటి వేళ ఆమె దుకాణం వద్దకు వెళ్లి ఎవ్వరికీ అనుమానం రాకుండా లోనికి వెళ్లిరెండు బంగారు గాజులు చోరీ చేసి పరారయ్యారు. దీనిపై కైకలూరు రూరల్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీస్ అధికారులు రామవరం గ్రామానికి చెందిన భూపతి ప్రదీప్ అలియాస్ బన్ను, కురెళ్ళ సుబ్బారావు అలియాస్ సుబ్బు అనే ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో నిందితుల నుంచి రూ.1 లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు.

రికవరీ సొమ్ము అందజేత

కైకలూరు రూరల్ సర్కిల్ పరిధిలో మూడు కేసులు, మండవల్లి స్టేషన్ పరిధిలో మూడు కేసులు, ముదినేపల్లి స్టేషన్ పరిధిలో రెండు కేసుల్లో మొత్తంగా సుమారు రూ.12,21,126 విలువైన బంగారు ఆభరణాలు, ఒక ఆటో, నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ రికవరీ నగదు, నగలు, వస్తువులను బాధితులకు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ చేతులమీదుగా అందజేశారు. సైబర్ నేరగాళ్ళబారిన పడి పోగొట్టుకున్న మరో రూ.2లక్షల నగదును సైబర్ సెల్ సీఐ దాసు, కానిస్టేబుల్ శివ ఆధ్వర్యంలో రికవరీ చేసి బాధితులకు అందజేశారు. ఈ సమావేశంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, డీసీఆర్‌బీ సీఐ అబీబ్ భాషా ఉన్నారు.

వైద్యుడి ఇంట్లో భారీ చోరీ

70 కాసుల బంగారు ఆభరణాలు, వజ్రాలు, నగదు అపహరణ



వైద్యుడి ఇంట్లో ఆధారాల సేకరిస్తున్న క్లూస్ టీమ్

ఏలూరు టౌన్: ఏలూరు శివారు ఆశ్రం హాస్పిటల్‌లో పనిచేస్తున్న వైద్యుడి ఇంట్లో శుక్రవారం పట్టపగటే భారీ చోరీ జరిగింది. ఏలూరు రూరల్ ఆశ్రం ఆస్పత్రిలో దాసరి లోకనాథం సీనియర్ వైద్యుడిగా పని చేస్తున్నారు. ఆయన భార్యతో కలిసి ఆశ్రం హాస్పిటల్ క్వార్టర్స్‌లోని ఇంట్లో నివాసం ఉంటున్నారు. వ్యక్తిగత పనులపై భార్య ఊరు వెళ్లగా ఆయన ఒక్కరే ఉంటున్నారు. ఈ నేపథ్యం శుక్రవారం ఉదయం యథావిధిగా వైద్యుడు లోకనాథం విధులకు వెళ్లారు. అనంతరం ఇంటికి తిరిగి వచ్చి చూసుకునే సరికి ఇంటి తాళం చెవులు కనిపించలేదు. కొంతసేపు వెదికిన అనంతరం ఆయనే ఇంటి తాళాలు స్వయంగా పగులగొట్టి లోనికి వెళ్లి చూసేసరికి బీరువా పగులగొట్టి ఉంది. బీరువాలోని సుమారు 70 కాసుల బంగారు ఆభరణాలు, వజ్రాలు, ఇతర విలువైన వస్తువులు, నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వేసిన తాళాలు వేసినట్లే ఉండి లోపల చోరీకి గురికావటంపై ఆయన షాక్ అయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీకి గురైన బంగారు ఆభరణాలు విలువ భారీగా ఉంటుందని, ఇక వజ్రాలు విలువ సుమారు రూ.కోటికి పైగా ఉంటుందని సహచర వైద్యులు గుసగుసలాడుతున్నారు. ఈ వజ్రాలు చోరీ ఇంటి దొంగల పనేనా? లేక బయట నుంచి వచ్చిన దొంగలా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. వృద్ధుడైన డాక్టర్ తన జీవితకాలం సంపాదించిన బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురి కావడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

● ఇరుకు వంతెనతో యాతన



గరగపర్రులో భీమవరం–తాడేపల్లిగూడెం ప్రధాన రహదారిపై ఉన్న వంతెనపై భారీ కంటైనర్ శుక్రవారం సుమారు రెండు గంటల ప్రాంతంలో ఇరుక్కుపోయింది. దీంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయి, భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వంతెన శిథిలావస్థకు చేరడంతో ఈ వంతెనపై భారీ వాహనాలను అనుమతించేది లేదని గతంలో అధికారులు ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పట్టించుకోకపోవడంతో యథావిధిగా వాహనాలు తిరుగుతున్నాయి.

– పాలకోడేరు

అల్లూరి సాంస్కృతిక కేంద్రం కోసం దీక్షలు



భీమవరం ప్రకాశంచౌక్ సెంటర్‌లో నిరాహార దీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం : పట్టణంలోని పాత బస్‌స్టాండ్ వద్ద తొలగించిన అల్లూరి సీతారామరాజు భవనం స్థానంలో అందరికీ ఉపయోగ పడే సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం నిర్మించాలని అల్లూరి మెమోరియల్ హాలు సాధన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రకాశంచౌక్ సెంటర్‌లో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ముందుగా అల్లూరి జయంతి సందర్భంగా సాధన కమిటీ గౌరవ అధ్యక్షుడు కనుమూరి సత్యనారాయణరాజు, సీపీఎం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారామ్ అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరాజు మాట్లాడుతూ గతంలో మెమోరియల్ హాలును విరాళాలు సేకరించి నిర్మించామన్నారు. హాలు శిథిలం కావడంతో దాన్ని తొలగించి తిరిగి నిర్మిస్తామని చెప్పి సంవత్సరాలు గడిచిపోయినా నిర్మాణం చేపట్టలేదని మండిపడ్డారు. రిలే నిరాహార దీక్షలలో సాధన కమిటీ సభ్యులు బి.బలరామ్, జేఎన్‌వీ గోపాలన్, బి.వాసుదేవరావు, డి.కళ్యాణి కూర్చున్నారు. సాధన కమిటీ నాయకులు కంతేటి వెంకటరాజు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి

బుట్టాయగూడెం: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందేలా అధికారులు, సిబ్బంది, కృషి చేయాలని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్‌రాజు అన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుట్టాయగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో ప్రజలకు అందించే సేవలపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. తీరు మార్చుకుని సక్రమంగా పని చేయాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 9.2 మిలియన్ యూనిట్‌ల కరెంట్ వినియోగం జరుగుతున్నట్లు తెలిపారు. రీవెంప్‌డ్ డిస్ట్రిబ్యూషన్ స్కీమ్ ద్వారా జిల్లాలోని ప్రతి గ్రామంలో 3 ఫేస్ కరెంట్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లాలో నూతనంగా 24 సబ్‌స్టేషన్‌లతోపాటు 5 నుంచి 10 పవర్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలు, మధ్యతరగతి వినియోగదారుల కోసం పీఎం సూర్యఘర్ పథకాన్ని అమలు చేస్తుందని అన్నారు. ఈ పథకంలో ఇప్పటి వరకూ 2600 యూనిట్‌లను రిలీజ్ చేశామని ఈ పథకం అమల్లో ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

క్లుప్తంగా

దివ్యాంగ పిల్లల్ని ఆదరించాలి



దివ్యాంగులకు బోధన సామగ్రి అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల విద్యార్థులను ప్రతి ఒక్కరు ఆదుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక భవిత కేంద్రంలో శిక్షణ పొందుతున్న దివ్యాంగుల విద్యార్థులకు దాతలు యలమర్తి శాంతి, బి.గిరిధర్, విజయ, ప్రణతి పొన్నగంటి జగదీష్, స్వర్ణక్రాంతి ఆధ్వర్యంలో శుక్రవారం బోధన సామగ్రి, ఎనర్జీ డ్రింక్స్, స్నాక్స్ డ్రాయింగ్ బుక్స్ అందజేశారు. వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దివ్యాంగుల పిల్లల్ని ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు ఎం.చంద్రకుమారి, ఎస్కే బాల ఈశ్వరయ్య, దివ్యాంగుల పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొణిజేటి రోశయ్యకు ఘన నివాళి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరీ కళ్యాణ మండపంలో ఆర్య వైశ్యులు ఆధ్వర్యంలో శుక్రవారం దివంగత ఏపీ ఉమ్మడి ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 92వ జయంతిని ఘనంగా నిర్వహించి, వారి విగ్రహానికి పూలమాల వేశారు. అధ్యక్షుడు కొర్లేపర రాము మాట్లాడుతూ రోశయ్య అటు రాష్ట్రానికి, ఆర్యవైశ్య సంఘానికి ఎనలేని సేవలు అందించిన మహనీయుడు అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఆయన ఇచ్చిన హామీలను, పలు సంక్షేమాలను రోశయ్య ఆర్థికశాఖ మంత్రిగా సమర్థవంతంగా నెరవేర్చారని కొనియాడారు. తమిళనాడు రాష్ట్రానికి గవర్నర్‌గా పనిచేసి, పలువురు అభినందనలు అందుకున్నారని చెప్పారు. పద్మనాభుని మురళీ, పూర్వ అధ్యక్షులు పేరూరి కాశయ్య, కోశాధికారి భోగవల్లి రమేష్, సెక్రటరీ కృష్ణ కుమార్, నున్న సుందరం, వైకుంఠం, రాంపండు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వచ్ఛత సాధనకు సహకరించాలి



జగన్నాథపురం గ్రామంలో తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్య సాధనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక అన్నారు. శుక్రవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తను తడి, పొడి చెత్తగా విభజించి వాటికికేటాయించిన డస్ట్ బిన్‌లలో వేయాలన్నారు. తద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే, ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్డి వినియోగించాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు దరిచేరవన్నారు. డిప్యూటీ ఎంపీడీవో ఎం.వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి బాలగోపాల శ్రీనివాస చంద్రరాజు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో అన్నదానం



ప్రత్తిపాడులో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి శుక్రవారం అమ్మవారి ఆలయంలో అన్నదానం ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సంకు వీరవెంకట సత్యనారాయణ, సుమవేణి దంపతులు, వారి కుటుంబసభ్యుల ద్వారా అన్నదాన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సుమారు 280 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ అర్చకులు సాతులూరి పవన్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ అధ్యక్షులు బడేటి ఉదయభాను, గ్రామస్తులు, దాతలు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 9వ తేదీన దేశ వ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ఏరియా కార్యకర్తల సమావేశం శుక్రవారం స్థానిక సిపాయిపేటలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో జరిగింది. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలు కోసమే కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని, లేబర్ కోడ్‌లను తెచ్చిందని, కార్మికులపై పని భారం పెంచుతుందని, ప్రతి ఒక్కరు తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు.

రాజమండ్రి దూరం.. ప్రయాణం భారం

- అమ్మో అనిపిస్తున్న ఆర్టీసీ ప్రయాణం
- అదనపు ఛార్జీల మోత
- బస్సు ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు
- గూడెం డిపో మేనేజర్ ఎక్కడ?



ఆగిన రాజమండ్రి బస్సు (ఫైల్)



బస్సు ఆగిపోవడంతో రాజమండ్రి బస్సు కోసం ఎదురు చూపులు చూస్తున్న ప్రయాణికులు (ఫైల్)



నిడదవోలు బస్సు వద్ద ప్రయాణికులు (ఫైల్)

తాడేపల్లిగూడెం (టీఓసీ): నిడదవోలు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా నిడదవోలు రైల్వే గేట్ క్లోజ్ చేయడంతో తాడేపల్లిగూడెం నుంచి శెట్టిపేట మీదుగా రాజమండ్రి వెళ్లే ప్రయాణీకులు నేడు అనేక ఇక్కట్లు పడుతున్నారు. తాడేపల్లిగూడెం ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్‌లో ప్రయాణీకులకు అవసరమైన సమాధానం చెప్పే వారే లేకుండా పోయారు. రాజమండ్రి వైపు శెట్టిపేట మీదుగా నిడదవోలు గేటు వరకు బస్సులు, అదే విధంగా తణుకు మీదుగా రాజమండ్రి బస్సులు ఎప్పుడు వస్తాయో, ఎప్పుడు వెళ్లతాయో తెలియకుండా పోయింది. బస్సులు మార్గమధ్యలో ఆగినప్పుడు, టైర్లకు ప్యాచీలు పడినప్పుడు ప్రయాణీకుల ఇక్కట్లు వర్ణణాతీతంగా మారాయి. బస్సు కాంప్లెక్స్‌లోకి బస్సులు ఎప్పుడు వస్తాయో తెలియకపోవడంతో ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారు. అనౌన్స్‌మెంట్లు లేవు. తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపోకు మేనేజర్ లేకపోవడంతో ఎవరికి వారే యమునా తీరే అన్న సంధానంగా ఉందని ప్రయాణీకులు వాపోతున్నారు. గతంలో తాడేపల్లిగూడెం డిపో, నిడదవోలు డిపోకు సంబంధించి శెట్టిపేట మీదుగా రాజమండ్రి వైపు 14 బస్సులు తిరిగేవి. ప్రయాణీకులకు పెద్దగా సమస్యలు ఉండేవి కావు. నేడు బస్సులు తిరుగుతున్నా ప్రయాణం దూర భారంగాను, చార్జీల మోతతోను ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఇబ్బందులు తొలగించాలి

నిడదవోలు రైల్వేగేటు వద్ద నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి, రైల్వే గేటు మూసివేత కారణంగా తాడేపల్లిగూడెం నుంచి శెట్టిపేట వైపు 3 నెలల పాటు మార్గంను మూసివేశారు. అయితే వాస్తవానికి 6 నెలలు పైగా సమయం పడుతుందని పలువురు చెబుతున్నారు. నిడదవోలు వంతెనను వేగవంతంగా పూర్తి చేయడం ద్వారా ప్రయాణీకుల ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

నిడదవోలు మీదుగా రాజమండ్రి వెళ్లే బస్సులు దారి మళ్లింపు

తాడేపల్లిగూడెం నుంచి శెట్టిపేట మీదుగా నిడదవోలు, రాజమండ్రి వెళ్లే బస్సులను తొలుతగా దారి మళ్లించారు. జూన్ నెల 23వ తేదీ నుంచి తాడేపల్లిగూడెం నుంచి ప్రత్తిపాడు క్రాస్ రోడ్డు, నవాబ్ పాలెం, మాధవరం, అప్పారావుపేట, కోరుమామిడి, తాడిమళ్ళ, తిమ్మరాజుపాలెం మీదుగా సింగిల్‌రోడ్డులో నిడదవోలు చేరుకునేవి. దీంతో దూరాభారం పెరగడం, రోడ్డు మార్గం అస్తవ్యస్తంగా ఉండటంతో పాటు ప్రయాణీకుల నుంచి అధనంగా రూ. 15 వసూలు చేయడంతో ప్రజలు ఇక్కట్లు పడేవారు. వాస్తవానికి శెట్టిపేట మీదుగా నిడదవోలుకు రూ. 30 మాత్రమే ఉండేది. రూ.45 వసూలు చేశారు. ఆర్టీసీ బస్సులు సైతం పాడైపోయాయి.

తణుకు వైపు మరో రూట్ ఏర్పాటు

ఇది ఇలా ఉంటే అద్దె బస్సులు నడిపేవారు నవాబ్ పాలెం, మాధవరం, అప్పారావుపేట, తాడిమళ్ళ, తిమ్మరాజుపాలెం రూట్ మార్గం సింగిల్ మార్గమని, రహదారి అస్తవ్యస్తంగా ఉందని, బస్సులు పాడు అవుతున్నాయని ఆర్టీసీ ఆర్‌ఎంకు విన్నవించడంతో జూన్ 29వ తేదీ నుంచి బస్సులు అన్ని తాడేపల్లిగూడెం నుంచి తణుకు, ఉండ్రాజవరం, కానూరు మీదుగా నిడదవోలుకు మరో రూట్ ఎంపిక చేసి నడుపుతున్నారు. ప్రస్తుతం ఆ మార్గంలో బస్సులు తిరుగుతున్నప్పటికి నిడదవోలు ఊరిలోకి బస్సులు వెళ్లకుండా సమిశ్రగూడెం నుంచి నేరుగా రాజమండ్రి వెళ్లిపోతున్నాయి. ఏదీ ఏమైనా ఈ మార్గంలో సైతం ప్రయాణీకులపై అదనపు చార్జీల భారం భారీగా పడుతుంది. దూరాభారం మరింత పెరిగింది.

లాభసాటిగా ఆటో ప్రయాణం

ఆర్టీసీ బస్సులు ఎప్పుడు వస్తాయో, ఎప్పుడు వెళ్లతాయో ప్రజలకు తెలియకపోవడంతో ఆటోలకు గిరాకి పెరిగింది. వారి బిజినెస్ లాభసాటిగా ఉంటుందని ప్రయాణీకులు వాపోతున్నారు. శెట్టిపేట మీదుగా నిడదవోలు వెళ్లే వారు ఎక్కువ మంది ఆటోలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడింది. పెద్ద సంఖ్యలో ఆటోలు తాడేపల్లిగూడెం నుంచి నిడదవోలుకు ప్రయాణీకులను చేరవేస్తున్నాయి.

తక్షణమే ఆర్టీసీ డిపో మేనేజర్‌ను నియమించండి

తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పనిచేసిన ఏలూరి సత్యనారాయణ మూర్తి పదోన్నతిపై రాజమండ్రి వెళ్లారు. నాటి నుంచి నేటి వరకు ఆర్టీసీ డిపోకు మేనేజర్‌ను నియమించలేదు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణీకులు రాజమండ్రి వైపు వెళ్లే బస్సులు ఎప్పుడు వస్తాయి? అని అడిగిన ప్రయాణీకులకు సమాధానం చెప్పే పరిస్థితులు లేకుండాపోయాయి. ఇంచార్జి డిపో మేనేజర్‌గా తణుకు డిపో మేనేజర్ వ్యవహరిస్తున్నారు. తాడేపల్లిగూడెంనకు డిపో మేనేజర్ లేకపోవడంతో ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయని ప్రయాణీకులు అంటున్నారు. తక్షణమే డిపో మేనేజర్ నియామకం చేపట్టాలని కోరుతున్నారు.

నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం

త్వరలో తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ వస్తారు. వర్షాలు కారణంగా రోడ్ల గోతులు పడ్డాయి. బస్సులు ఆలస్యం అవుతున్నాయి. సమస్యలను పరిష్కరిస్తున్నాం. తాడేపల్లిగూడెం, తణుకు డిపో మేనేజర్‌గా వ్యవహరిస్తూ నిరంతరం మోనిటరింగ్ చేస్తున్నాం. ప్రయాణీకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నాం.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

తణుకు అర్బన్: ఈ నెల10వ తేదిన గురుపౌర్ణమి సందర్భంగా తణుకు డిపో నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణకు బయలుదేరే భక్తుల సౌకర్యార్థం అరుణాచలం ప్రత్యేక ఆర్టీసీ సర్వీసుకు రిజర్వేషన్ సదుపాయం మొదలైనట్లు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. ఈనెల 8వతేదీ సాయంత్రం 5గంటలకు తణుకు ఆర్టీసీ బస్టాండ్ నుంచి బయలుదేరి 9వతేదీన ఉదయం పంచ భూతలింగాలలో ఒకటయిన శ్రీకాళహస్తి వాయు లింగం దర్శనం చేసుకుని, మధ్యాహ్నం కాణిపాకం శ్రీ విఘ్నేశ్వరస్వామి దర్శనానంతరం శ్రీపురంలోని స్వర్ణ దేవాలయం శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దర్శనం చేసుకుని, గురుపౌర్ణమి రోజు అనగా 10వ తేదిన అరుణాచలం గిరిప్రదక్షిణ, పంచలింగ క్షేత్రాలయైన అరుణాచలం అగ్నిలింగం దర్శనం తర్వాత కంచి దర్శనాల అనంతరం 12వతేది తణుకు చేరుకుంటుందని వివరించారు. సూపర్‌లగ్జరీ సర్వీసుకు రూ.3 వేలు టికెట్ ధరగా నిర్దేశించినట్లు చెప్పారు. ఇతర వివరాలకు 73829 03287, రిజర్వేషన్ కోసం 93471 40067 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఆషాడ మాసం సందర్భంగా ఆషాడం దేవి దర్శనయాత్ర కూడా ఏర్పాటుచేశామని ఈ యాత్రలో చింతలూరు-నూకాలమ్మ, మాట్లపాలెం-మహాలక్ష్మి, కాకినాడ-వారాహి, పిఠాపురం-పురుహూతిక, తాటిపర్తి-అపర్ణా దేవి, పెద్దాపురం-మరిదమ్మ, కాండ్రకోట-నూకాలమ్మ అమ్మవార్ల దర్శనం ఒకే రోజు చేసుకునేలా ఆర్టీసీ సర్వీసు ఏర్పాటు చేశామని భక్తులు ఏరోజు కావాలంటే ఆరోజు ఏర్పాటుచేస్తామని టికెట్ ధర రూ. 550 మాత్రమేనని, ఈ అవకాశాన్ని తణుకు పరిసర ప్రాంత భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ చిరునామా మార్పు

తణుకు అర్బన్: తణుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కొండాలమ్మ పుంత రోడ్డులోని పాత ఏకేటీపీ స్కూలు భవనం ఎదురుగా ఉన్న శ్రీసాయి సత్య ఆంజనేయ అపార్టుమెంట్ (ఎస్ఎస్ఎస్ కాంప్లెక్స్)లోకి మార్చబడినట్లు సబ్ రిజిస్ట్రార్ డి.రాధాబాయి తెలిపారు. తణుకు కోర్టు భవనాల ప్రాంగణంలో ఉన్న పాత భవనం శిథిలావస్థకు చేరడంతో రికార్డులు, ఇతర భద్రతా కారణాల నేపథ్యంలో మార్చవలసి వచ్చిందని ప్రజలు గమనించగలరని కోరారు.

చంద్రబాబు మోసం గ్యారంటీ



విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం: చంద్రబాబు అంటే ష్యూరిటీ కాదని, మోసం గ్యారంటీ అని మాజీ డిప్యూటీసీఎం కొట్టు సత్యనారాయణ విమర్శించారు. వైఎస్సార్ సీపీ భీమవరం సమావేశానికి తరలి వెళ్తూ శుక్రవారం ఆయన ఇంటివద్ద పార్టీ శ్రేణులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. వాగ్దానాలు ఎగ్గొట్టడం, ప్రజలను ఇబ్బంది పెట్టడం, రెడ్‌బుక్ పరిపాలన పేరుతో కక్ష సాధింపులతో అక్రమ కేసులు పెట్టడమే కూటమి ప్రభుత్వం చేస్తుందన్నారు. పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తుందన్నారు. మేం చెప్పిందే వ్యవస్థలు చేయాలని ఐఏఎస్, ఐపీఎస్‌లకు విలువలేకుండా ప్రభుత్వం చేస్తుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సింది పోయి అధికారులను తొత్తులుగా మార్చుకొని, నిజాయితీ కలిగిన అధికారులను పక్కకు పెడుతుందన్నారు. రాజ్యాంగ ఉల్లంఘనకు కూటమి ప్రభుత్వం పాల్పడుతున్నా, పవన్ కల్యాణ్ వ్యక్తిత్వం లేకుండా బాబుకు భజన చేస్తూ, ఆయన వెనుక ఉన్న సామాజికవర్గాన్ని బాధపెడుతున్నారన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు లేదు, రైతులకు ఎలాంటి సాయం చేయకుండా నోట్లో మన్ను కొడుతున్నారు. తల్లికి వందనంలో కోత విధించారు. కార్యకర్తలు , నాయకులు చెప్పిన విధంగా వ్యవస్థలు పనిచేస్తున్నాయని దుయ్యబట్టారు. ఇలాంటి విషయాలపై ప్రజల్లో చైతన్యం కలిగించడానికి వైఎస్సార్ సీపీ తరపున కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. నియోజకవర్గస్థాయిలో సమావేశం, మండల స్థాయిలో సమావేశం, గ్రామ స్థాయిలో రచ్చబండ కార్యక్రమాలు చేపడతామన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి పాలనలో ప్రజలకు జరుగుతున్న వివరాలను వివరించే కార్యక్రమం చేపడతామన్నారు. అనంతరం భారీ కార్లర్యాలీతో భీమవరం బయలుదేరి వెళ్లారు. ఆయన నివాసం నుంచి రెండోఫ్లైవోవర్ వంతెనమీదుగా ఈ ర్యాలీ భీమవరం వైపునకు వెళ్లింది. ఏలూరు నుంచి వచ్చిన పార్టీ రీజినల్ బాధ్యులు మాజీ మంత్రి బొత్ససత్యనారాయణ, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రలు ఈ ర్యాలీలో కలిసి భీమవరం వెళ్లారు. కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, జడ్డు హరిబాబు, కైగాల శ్రీనివాసు,గుండుమోగుల సాంబయ్య, బందారు నాగు, వెలిశెట్టి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పేదల గుండె చప్పుడు వంగవీటి



తణుకులో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాపు సంఘం, వైఎస్సార్‌సీపీ నాయకులు

తణుకు అర్బన్: పేదవర్గాల గుండె చప్పుడుగా వంగవీటి మోహనరంగా కీర్తించబడ్డారని కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంటెద్దు ఈశ్వరప్రసాద్ అన్నారు. రంగా జయంతి సందర్భంగా శుక్రవారం తణుకు వంగవీటి మోహనరంగా వీధిలోని ఆయన విగ్రహానికి కాపు సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టంలో ఉన్న పేదింట నేనున్నానంటూ నిలబడిన తీరు పేదవర్గాల్లో జీర్ణించుకుపోయిందని అన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాలకు ఎన్నో సేవలు చేశారని అన్నారు. తణుకులో రంగా విగ్రహాన్ని మునిసిపల్ కాంప్లెక్స్ వంటి ప్రాధాన్యత ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేయడమే కాకుండా ఆ వీధికి కూడా వంగవీటి మోహనరంగా వీధిగా అధికారికంగా నామకరణం చేసిన ఘనత మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు మాత్రమే దక్కుతుందని కాపు సంఘ నాయకులు అన్నారు. కాపు వర్గాలు కోరిన వెంటనే రంగా విగ్రహాన్ని ఏర్పాటుచేయడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘ నాయకులు అద్దాల అనంతబాబు, అద్దాల రామకృష్ణ, గాజుల కాశీ, యిండుగపల్లి బలరామకృష్ణ, పుల్లెపు సూరిబాబు, పైబోయిన ఏసుబాబు, నూకల కనకదుర్గ, వన్నెంరెడ్డి మురళీమోహన్, గారపాటి సత్యనారాయణ, గోపిరెడ్డి చిన్నారావు, ఆకుల సతీష్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పట్టణంలో ఆరోగ్య అవగాహన ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమల నివారణకు కలిసికట్టుగా కృషి చేద్దామని సబ్ యూనిట్ అధికారి ఎస్‌వీఎస్ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని కడకట్ల అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని 30, 31, 32 వార్డులలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, డెంగీ మాసోత్సవాలు, ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాలు జరిగాయి. పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో హెల్త్ సిబ్బందిచే ర్యాలీ నిర్వహించారు. వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలు జరిగాయి. ప్రసాద్ మాట్లాడుతూ దోమలు వల్ల మలేరియా, చికెన్‌గునియా, బోధకాలు, మెదడువాపు తదితర వ్యాధు లు వస్తాయని, వర్షకాలం కావడంతో వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. నివాస ప్రాంతాలు వద్ద వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, తప్పక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ లార్వాలను నివారించేందుకు సమిష్టి కృషి ఎంతో అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కాంతారావు, కార్యదర్శి శ్రీను, హెల్త్ సెక్రటరీలు ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి జీవితం నేటితరానికి స్ఫూర్తిదాయకం



ఈడూరులో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న క్షత్రియ సేవా సమితి సభ్యులు



తణుకులో అల్లూరి విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న భీమారావు తదితరులు



విప్లవ వీరుడు అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వాకర్స్ సభ్యులు

అత్తిలి: సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి, దానికోసమే తన ప్రాణాలను అర్పించిన మహోన్నత వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని గ్రామ సర్పంచ్ మంతెన రామలింగ రాజు అన్నారు. అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో శుక్రవారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంతెన వాసురాజు మాట్లాడుతూ ఆంధ్రులకు గర్వకారణంగా నిలిచిన అల్లూరి సీతారామరాజు జీవితం, పోరాటాలు ఈ తరం ప్రజలకు గొప్ప స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో క్షత్రియ సేవా సంఘ సభ్యులు అల్లూరి బాపిరాజు, దండు రామపండురాజు, పచ్చమట్ల సుబ్బరాజు, పెన్మెత్స సత్యనారాయణరాజు, ముదుండి వెంకన్న రాజు, చేకూరి రంగరాజు, మంతెన వాసురాజు, కోసూరి ఆంజనేయరాజు, చేకూరి గోపాలరాజు, అల్లూరి మురళీరాజు, అల్లూరి సూర్యనారాయణరాజు, అల్లూరి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళులు

తణుకు అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటపటిమ, ఉద్యమ స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. మన్యం విప్లవవీరుడు అల్లూరి 128వ జయంతి సందర్భంగా శుక్రవారం తణుకు వీరనారాయణ థియేటర్ సెంటర్లో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి సీపీఐ తణుకు పట్టణ సమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా భీమారావు మాట్లాడుతూ దేశంలో బ్రిటిష్ వలసపాలన అంతానికి దేశ స్వాతంత్ర్య సముపార్జనకు మొక్కవోని దీక్షతో ఎనలేని ధైర్యసాహసాలతో పోరాడి బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారన్నారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఏరియా కార్యదర్శి సికిలే పుష్పకుమారి, సీపీఐ నాయకులు డీవీఎన్ హనుమంతరావు, గుబ్బల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకను తేతలి జిల్లా పరిషత్ హైస్కూలులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం కోట సూర్య వెంకట విశ్వేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.రాజకుమారి, జి.సుధారాణి, పి.గంగాభవాని, బీఎం గోపాలరెడ్డి పాల్గొన్నారు.

విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ అల్లూరి పోరాట పటిమను నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుంట్ల కనకదుర్గ, రామలక్ష్మి, రమాదేవి, పూజిత, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఉద్యమ నేత అల్లూరు సత్యనారాయణ, మన్యం విప్లవ వీరుడు, స్వాతంత్ర్యం సమరయోధులు అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు పోరాటాలు సాగించాల్సి ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ నాయకులు పతివాడ నాగేంద్రబాబు, జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, సత్తి కోదండ రామిరెడ్డి, చిటికిన రాము, శేషుబాబు, ఎస్.కృష్ణ, సతీష్, ఎర్రి నాయుడు, రమణ, నానాజీ, శ్రీను పాల్గొన్నారు.

బానిస సంకెళ్ల విముక్తికి పోరాడిన 'అల్లూరి'

తాడేపల్లిగూడెం రూరల్: దేశ ప్రజలను బ్రిటీష్ వారి బానిస సంకెళ్ళ నుంచి విముక్తి చేయడానికి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు సాయుధ పోరాటం చేశారని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. తొలుత సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఈవో వి.హనుమ, మండల పరిషత్ ఏవో సుజాత, ఎంఈవో-2 పీఎం కే.జ్యోతి, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీలో అల్లూరి జయంతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మండలంలోని వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీలో అల్లూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపకులపతి డాక్టర్ కే.గోపాల్ అల్లూరి చిత్రపటానికి పూలమాలతో అలంకరించారు. నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అల్లూరి స్ఫూర్తితో ప్రతి భారతీయుడు దేశ సంరక్షణకు అభివృద్ధిలో భాగం పంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరవల్లి దళితపేటలో ఎస్పీ, ఆర్డీవో పర్యటించాలి

అత్తిలి: మండలంలో ఆరవల్లి గ్రామంలో గత నెల 23వ తేదీన ఎస్సీ ఉపకులాల మధ్య జరిగిన పరస్పర దాడులపై శుక్రవారం కేవీపీఎస్ జిల్లా బృందం నిజనిర్ధారణ కమిటీగా పర్యటించారు. దళిత పేటలో శాంతియుత శిబిరంలో కూర్చున్న ఒకవర్గం ప్రజలతోబృందం కలిసి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. మరో వర్గం ప్రజలు అందుబాటులో లేకపోవడంతో కలవలేకపోయారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ ఆరవల్లి గ్రామంలో దళితుల మధ్య జరిగిన పరస్పర దాడులు బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలో పునరావృతం కాకుండా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఘటన జరిగి పది రోజులు దాటిన నేటి వరకు డిఎస్పీ, ఆర్డీవోలు ఇప్పటికీ పర్యటించకపోవడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిన్న నాగేశ్వరరావు, దళితులు భీమన్న, బాలకృష్ణ, నాగరాజు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలికంగా సమ్మె విరమణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, తమ న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించడానికి సిద్ధంగా ఉందని, సీడీఎంఏ ఐఏఎస్ సంపత్‌కుమార్ హామీ ఇచ్చారని ఈ కారణంగా తాత్కాలికంగా సమ్మె విరమించడం జరిగిందని నాయకులు మర్రిపూడి సతీష్ కుమార్, అవిడి కుమార్, ఎర్రంశెట్టి నాగేశ్వరరావు, బండారు శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మునిసిపల్ కమీషనర్ యేసుబాబు, వివిధ అధికారులు వెళ్లి నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింప చేశారు. అభినందనలు చెప్పారు.